# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 3 | సంపుటి : 4 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 05-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

అందచందమున్న యారోగ్యమును గాదు
కలిమినున్న మనకు బలిమిగాదు
పుత్తడిగలిగినను సత్తువ గాదండి
సర్వమున్ను కలుగు సంతసమున

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సంచలనాలు నమోదు
- ద్రవిడ నేలపై ఎగ్జిట్‌పోల్ అంచనాలు తలకిందులు
- తొలి ఎన్నికల్లోనే 'జననాయగన్' జయకేతనం
- 107 సీట్లతో అతిపెద్ద పార్టీగా టీవీకే అవతరణ
- సిట్టింగ్‌స్థానం కొళత్తూర్‌లో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ
- వెస్ట్ బెంగాల్‌లో తొలిసారి పాగా వేసిన బీజేపీ
- భవానీపూర్ స్థానంలో మమతకు పరాజయం
- కేరళలో లెఫ్ట్‌కు షాక్.. యూడీఎఫ్‌కు పగ్గాలు
- అస్సాంలో కమలం.. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్
- శిష్యుడి చేతిలో రెండోసారి పరాజయం
- 35 ఏండ్లలో తొలిసారి ఓటమిపాలు

# విజయ్ విహారం

## తమిళనాట టీవీకే సంచలనం.. బెంగాల్‌లో ఓడిన తృణమూల్



**పశ్చిమ బెంగాల్ (293/294)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| బీజేపీ+ | 206 | 77 | +129 |
| టీఎంసీ+ | 81 | 214 | -133 |
| కాంగ్రెస్ | 2 | 0 | +2 |
| ఇతరులు | 4 | 2 | +2 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 148

**తమిళ నాడు (234)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| టీవీకే | 107 | - | +107 |
| డీఎంకే+ | 74 | 159 | -85 |
| ఏఐడీఎంకే+ | 53 | 75 | -22 |
| ఇతరులు | 1 | 0 | +1 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 118

**కేరళ (140)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| యూడీఎఫ్ | 99 | 40 | +59 |
| ఎల్డీఎఫ్ | 35 | 92 | -57 |
| బీజేపీ+ | 3 | 0 | +3 |
| ఇతరులు | 3 | 8 | -5 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 71

**అస్సాం (126)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| బీజేపీ+ | 102 | 73 | +29 |
| కాంగ్రెస్+ | 21 | 31 | -10 |
| ఏఐయూడీఎఫ్+ | 2 | 16 | -14 |
| ఇతరులు | 1 | 6 | -5 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 64

**పుదుచ్చేరి (30)**

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| ఎన్నార్ కాంగ్రెస్ | 18 | 16 | +2 |
| కాంగ్రెస్+ | 6 | 8 | -2 |
| టీవీకే+ | 3 | - | +3 |
| ఇతరులు | 3 | 6 | -3 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 16

ద్రవిడ రాజకీయాల తమిళనాట యువటోర్నడో ఆవిర్భవించింది. బెంగాల్‌లో తుఫాన్ ధాటిని 'గడ్డిపువ్వు' తట్టుకోలేకపోయింది. పదేండ్ల తర్వాత కేరళలో వామపక్ష కూటమి ప్రభుత్వం నుంచి పక్కకు తప్పుకొని, పాత ఆనవాయితీకి మళ్లీ ప్రాణంపోసింది. నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతానికి సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో సంచలనాలు నమోదయ్యాయి. ఓటరు తీర్పునకు ముగ్గురు ముఖ్యమంత్రులు గద్దె దిగారు. అస్సాంలో మూడోసారి బీజేపీ జెండా ఎగురవేయగా, పుదుచ్చేరిలో ఎన్నార్సీ కూటమి మరోసారి గెలుపొందింది.

2 లో





దీదీ కంచుకోట బద్దలు

## కేరళలో ఫలించిన సీఎం
# రేవంత్ వ్యూహాలు

- అధిష్ఠానం వద్ద పెరిగిన సీఎం గ్రాఫ్
- యూడీఎఫ్ విజయం వెనుక ఉన్న ఫలితాలు ఇవే
- దీంతో కాంగ్రెస్‌లో పవర్ ఫుల్ లీడర్‌గా రేవంత్ రెడ్డి


హైదరాబాద్

దేశరాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) విజయం వెనుక రేవంత్ రెడ్డి అనుసరించిన వ్యూహాలు హస్తం పార్టీలో ఆసక్తిని రేపుతున్నాయి. ఈ దెబ్బతో రేవంత్ రెడ్డి ఇమేజ్ మరోసారి కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద మరింత పెరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని వాడుకుని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో రేవంత్ రెడ్డి పోషించిన పాత్ర గేమ్



ఛేంజర్ గా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడిగా

-మిగతా 2 లో



## వాంఖడేలో ముంబై సునామీ బ్యాటింగ్.

- రోహిత్, రికెల్టన్ విధ్వంసంతో 229 టార్గెట్‌ను ఊదేశారు!
- వాంఖడేలో కమ్ బ్యాక్ ఇచ్చిన ముంబై ఇండియన్స్
- 83 పరుగులతో రికెల్టన్, 84 పరుగులతో రోహిత్ విధ్వంసం
- సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసిన ముంబై

న్యూఢిల్లీ:

ముంబై ఇండియన్స్ అంటే ఏంటో ఇన్నాళ్లు చూయించారు. ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు వస్తున్న సమయంలో ముంబై ప్లేయర్లు ఫామ్‌లోకి వచ్చారు. బౌలింగ్‌లో ఆరంభంలో తడబడిన ముంబై.. ఆఖర్లో అద్భుతంగా బంతులు వేసి లక్నోని 250 టచ్ చేయకుండా చేసింది. ఇక బ్యాటింగ్‌లో గాయపడ్డ సింహంలా రోహిత్ శర్మ కమ్ బ్యాక్ ఇన్నింగ్స్‌తో లక్నో బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ర్యాన్ రికెల్టన్ విరుచుకుపడటంతో ఓపెనర్లు ఇద్దరే ముంబైను విజయతీరాలకు చేర్చారు.వాంఖడే వేదికగా జరిగిన హై ఓల్టేజ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ - ముంబై ఇండియన్స్ పోటాపోటీగా బ్యాటింగ్ చేసింది. లక్నో అందించిన 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌ను ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ అద్భుతంగా నడిపించారు.

-మిగతా 2 లో

## త్వరలో మంత్రివర్గ
# విస్తరణ?

**తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఈసారి రెడ్లకు నో ఛాన్స్**

- గతంలోనే సీఎం, ఏఐసీసీ నేతల మధ్య చర్చ
- బీసీల్లో ఒకరికి మంత్రి పదవి ఖాయం?
- ఎస్టీల్లో ఒకరికి అవకాశం

హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులు బీసీ, ఎస్టీకి దక్కే అవకాశాలున్నాయి. ఇంకో రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చేది లేదని ఏఐసీసీ, ఇటు ముఖ్యమంత్రి ఏకాభిప్రాయంతో ఉన్నట్లు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాల సమాచారం. ప్రస్తుత మంత్రివర్గంలో ఇద్దరు లేదా ముగ్గురిని తొలగించి వారి స్థానంలో కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వొచ్చనే ఊహాగానాలు కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి.

-మిగతా 2 లో



## 'దేశమంతా మోడీ మయం'

- 21కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు
- బెంగాల్ ఫలితాలపై బీజేపీ ఆసక్తికర పోస్ట్
- ఎన్డీయే పాలిత రాష్ట్రాలను చూపిస్తూ ఇండియా మ్యాప్ విడుదల




న్యూఢిల్లీ:

బెంగాల్‌లో బీజేపీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు తగ్గట్టుగానే ఫలితాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో బీజేపీ ఒక ఆసక్తికర పోస్ట్‌ను విడుదల చేసింది. కాషాయం బీజేపీకు చెందిందని, ఇక భారత్ అంతా మోడీ మయం అంటూ తెలిపింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాషాయం కలర్‌తో చూపిస్తూ ఇండియా మ్యాప్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'దేశ కేంద్రం (ఢిల్లీ) నుంచి బెంగాల్ వరకు,

-మిగతా 2 లో

## రాష్ట్రంలో క్షీణించిన
# శాంతిభద్రతలు

- ప్రభుత్వానిది మొద్దు నిద్ర
- కరీంనగర్ దోపిడీ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంత్రులెక్కడీ బండి సంజరు వైఖరిపై విమర్శ

కరీంనగర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాల్లో రాష్ట్రం బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పోటీ పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ షాపులో జరిగిన దోపిడీ, కాల్పుల నేపథ్యంలో సోమవారం ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం

-మిగతా 2 లో





## అసాధ్యమైన యుద్ధమా?
# ఒప్పందమా?

- అమెరికాకు వేరే దారులు లేవన్న ఇరాన్ నాయకత్వం
- పద్నాలుగు పాయింట్లతో కొత్త శాంతి ప్రతిపాదన
- దురుసుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు: డొనాల్డ్ ట్రంప్

టెహ్రాన్

అమెరికాపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) తన మాటల దాడిని ఉధృతం చేసింది. ఇరాన్‌ను ఎదుర్కోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు చాలా పరిమితమైన, క్లిష్టమైన దారులు ఉన్నాయని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. సాధ్యంకాని ఆపరేషనా లేక ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందమా అన్న దాంట్లో ఒకదాన్ని ట్రంప్ ఎంచుకోవాలని ఐఆర్‌జీసీ నిఘా విభాగం ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు ఇరానియన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. ఈ హెచ్చరిక రెండు దేశాల మధ్య, ముఖ్యంగా ఆ ప్రాంతంలో అమెరికా సైనిక ఒత్తిడి విషయంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తున్నది. ఐఆర్‌జీసీ ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టులో ఇవే వ్యాఖ్యలు మరోసారి వెలువడ్డాయి.

-మిగతా 2 లో

# వాంఖడేలో ముంబై సునామీ బ్యాటింగ్.



మొదటి తరువాయి

ఈ ఇద్దరే 10.5 ఓవర్లలో 145 పరుగులు నమోదు చేసి ముంబై విజయాన్ని ఖరారు చేశారు.ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ ఆరంభం నుంచే దూకుడు ఆడటం మొదలుపెట్టారు. పవర్ ప్లేలో 71 పరుగులు నమోదు చేసిన ఓపెనర్లు.. ఆ తర్వాత విధ్వంసం సృష్టించారు. ర్యాన్ రికెల్టన్ 32 బంతుల్లో ఆరు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో ఏకంగా 83 పరుగులు చేశాడు. ఒకానొక దశలో సెంచరీ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ మొహ్సిన్ ఖాన్ బౌలింగ్‌లో షాట్‌కి ప్రయత్నించి దొరికిపోయాడు.ర్యాన్ రికెల్టన్ 22 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. రోహిత్ శర్మ 27 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. చాలా మ్యాచ్‌ల తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చిన రోహిత్ శర్మ 44 బంతుల్లో 84 పరుగులు చేసి అవుటయ్యాడు. రోహిత్ ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉండగా.. ర్యాన్ రికెల్టన్ ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, మూడు 8 సిక్సర్లు ఉన్నాయి. రోహిత్ అవుటయ్యే సమయానికి ముంబై 14 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది.ఓపెనర్లు ఇద్దరూ అవుటైన తర్వాత ఆ ఫామ్‌ను నమన్ ధీర్ కొనసాగించాడు. తిలక్ వర్మ ఫస్ట్ డౌన్‌లో వచ్చినా పెద్దగా రాణించలేకపోయాడు. 13 బంతులు ఆడిన తిలక్ కేవలం 11 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా పెద్దగా రాణించలేకపోయాడు. 7 బంతుల్లో రెండు ఫోర్లతో 12 పరుగులు చేసి అవుటయ్యాడు. వికెట్లు పడుతున్నా నమన్ ధీర్ 12 బంతుల్లో 23 పరుగులు చేసి మ్యాచ్ విజయంలో తన వంతు పాత్ర కూడా పోషించాడు. విల్ జాక్స్ విన్నింగ్ షాట్ బాదడంతో ముంబై ఇండియన్స్ 18.4 ఓవర్లలోనే 229 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది.

# ‘దేశమంతా మోడీ మయం’

మొదటి తరువాయి

ఈ విస్తరణ కేవలం భౌగోళిక చిత్రపటంలో వ్యాప్తి మాత్రమే కాదు. ఇది ప్రగతి పథంలో పయనించాలని దృఢంగా సంకల్పించిన ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోంది. ఇప్పటికీ వేగంగా సాగుతున్న ఒక బృహత్తర గాథలో బెంగాల్ కేవలం ఒక సరికొత్త అధ్యాయం మాత్రమే. మనమందరం కలిసి 2047లోగా వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం’ అని బీజేపీ పోస్ట్‌లో రాసుకొచ్చింది.

21కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు

బెంగాల్‌లో విజయం సాధించడం వల్ల దేశంలో ఎన్డీయే పాలనలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి పెరగనుంది. బెంగాల్ విజయం ద్వారా బీజేపీ స్వతంత్రంగా పాలించే రాష్ట్రాలు 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీతో కూటమి వల్ల మొత్తం సంఖ్య 21కి చేరుతోంది. ప్రస్తుతం దేశంలో 29 రాష్ట్రాలు ఉండగా, మెజారిటీ మార్క్ 14.5. ఈ విధంగా చూస్తే కేరళ, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మిజోరం మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్డీయే కొనసాగుతోంది.

ఆరు రాష్ట్రాలకే పరిమితమైన ఇండియా కూటమి

కేంద్రంలో ప్రధాన ప్రతిపక్ష కూటమిగా ఉన్న ఇండియా కూటమి ప్రస్తుతం ఆరు రాష్ట్రాల్లో మాత్రమే ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తమిళనాడులో ఓటమి ఎదురైనా, కేరళలో విజయంతో కొంత ఊరట లభించింది. అయినప్పటికీ ఈ ఫలితాలు కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి భవిష్యత్తుపై అనిశ్చితిని సృష్టించాయి. ఎన్నికల సంఘం ఫలితాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కేవలం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనే స్వతంత్ర మెజారిటీ ప్రభుత్వాలను కలిగి ఉంది. ఝార్ఖండ్‌లో జేఎంఎంతో కూటమిలో ఉంది. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్?) అధికారంలో ఉన్నప్పటికీ అది ఇండియా కూటమిలో భాగం కాదు. ఇప్పుడు తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ కూటమి పరాజయం పాలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం (టీవీకే) పార్టీ భారీ ఆధిక్యంతో ముందంజలో ఉంది. 234 స్థానాల్లో 110 స్థానాల్లో టీవీకే ఆధిక్యంలో ఉంది. అటు అసోంలోనూ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

# అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్..

-చిత్తుగా ఓడిన కాంగ్రెస్

-పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొగోయ్ కూడా ఓటమిపాలు



**గువాహటి,**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అస్సాంలో వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకుంది. హిమంత బిశ్వశర్మ పాలనకు అనుకూలంగా ప్రజలు తీర్పు చెప్పారు. 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 102 సీట్లతో ఎన్డీఏ కూటమి విజయాన్ని సాధించింది. ఇక్కడ బీజేపీ 81 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించగా, దాని మిత్రపక్షాలైన బోడో పీపుల్స్ ఫ్రంట్, అస్సాం గణపరిషత్ చెరో 10 సీట్లను దక్కించుకున్నాయి. అస్సాం సీఎం బిశ్వ శర్మ జలుకబరిలో విజయం సాధించారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి అధికార పార్టీ జోరుకు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేక పోయింది.కాంగ్రెస్ 21, ఏఐయూడీఎఫ్ 2, ఇతరులు ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ కూడా పరాజయం పాలయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ అస్సాం పోల్ ఇన్‌చార్జి భన్వర్ జితేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. అస్సాంలో 16 సీట్లలో తొలిసారిగా పోటీ చేసిన జార్ఖండ్ ముక్తి మోర్చా తన ఖాతాను తెరవడంలో విఫలమైంది. ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ బిన్నకండి నియోజకవర్గంలో విజయం సాధించారు.

# విజయ్ విహారం

**న్యూఢిల్లీ:**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 234 స్థానాల్లో 107 సీట్లను గెలుచుకొని విజయ ఢంకా మోగించింది. అధికార డీఎంకే కూటమి 74 స్థానాలకు పరిమితమయ్యింది. పోటీచేసిన రెండు స్థానాల్లో విజయ్ విజయం సాధించగా.. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్ పరాజయం పాలయ్యారు.ఇక, దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠకు గురిచేసిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కంచుకోటలో బీజేపీ కూటమి తొలిసారిగా పాగా వేసింది. మొత్తం 294 సీట్లలో 208 స్థానాలను గెలుచుకొని అధికారాన్ని



చేజిక్కించుకొన్నది. భవానీపూర్ నుంచి పోటీ చేసిన మమత.. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కేరళలో లెఫ్ట్ కూటమికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గండి కొట్టింది. 140 అసెంబ్లీ స్థానాలు ఉన్న కేరళలో.. యూడీఎఫ్ కూటమి 89 స్థానాల్లో గెలుపొందగా, ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలకే పరిమితమయ్యింది. అస్సాం లో బీజేపీ ఘన విజయం సాధించింది. 126 స్థానాల్లో బీజేపీ కూటమి 102 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ కూటమి 21 స్థానాలకు పరిమితమయ్యింది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ కూటమి మ్యాజిక్ మార్కును దాటింది.

# కేరళలో ఫలించిన సీఎం రేవంత్ వ్యూహాలు

మొదటి తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన నాటి నుండి రేవంత్ రెడ్డి నిరంతరం తన ధాతువును చూపిస్తుండగా తాజాగా కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళి ఆయనను జాతీయ కాంగ్రెస్‌తో పోల్చినా అధిష్ఠానం పెద్దల మన్ననలు పొందుతున్నారనే టాక్ వినిపిస్తోంది. తనదైన దూకుడుతో సొంత రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్సార్‌ను తలపిస్తున్నారని జాతీయ స్థాయిలో అధిష్ఠానానికి మంచి ఆప్తునిగా మారుతున్నారనే చర్చ గుప్పుమంటోంది.

తెలంగాణలో జోరు: పీసీసీ హోదాలో ఉంటూ 2023లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన నాటి నుండి ముఖ్యమంత్రి అయ్యాక వరుస విజయాలతో రేవంత్ రెడ్డి గ్రాఫ్ నిరంతరం పెరుగుతూనే ఉంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నా తెప్పిస్తానని చెప్పి మరీ ఆ పార్టీని జీరో సీట్లకు పరిమితం చేయడంతో పాటు రాష్ట్రంలో జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలను కాంగ్రెస్ ఖాతాలో వేయించగలిగారు. ఇక ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రత్యర్థులు ఎన్ని ఆరోపణలు చేసినా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీదే పై చేయిగా నిలపడంలో రేవంత్ రెడ్డి వ్యూహాలు ఫలించాయి. ఈ పరిణామాలతో కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్ రెడ్డి ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇటీవల పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

జాతీయ స్థాయిలో స్పీడ్: గత నెలలో లోక్ సభలో కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశానికి సంబంధించిన బిల్లుపై రేవంత్ రెడ్డి తన మార్క్ చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డీలిమిటేషన్ కార్యక్రమానికి మోదీ సర్కార్ శ్రీకారం చుడుతోందంటూ రేవంత్ రెడ్డి అగ్గిరాజేశారు. ఆ బిల్లును అడ్డుకుని చూపిస్తామని సవాల్ విసిరారు. అందుకు తగ్గట్టుగానే ఈ విషయంలో దేశంలో మిగతా ముఖ్యమంత్రులందరికంటే రేవంత్ రెడ్డినే పెద్ద ఎత్తున చర్చ జరిగేలా వ్యూహం రచించారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ ఏకంగా పార్లమెంట్లోనే ప్రస్తావనకు వచ్చిందంటే ఆయన వ్యూహం ఏ మేరకు ఫలించిందో అర్థం చేసుకోవచ్చని రేవంత్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే మహిళా బిల్లుకు సంబంధించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దాంతో రేవంత్ రెడ్డి పేరు జాతీయ స్థాయిలో మారుమోగింది.

దూకుడు వైఖరే బలం:

తాజాగా కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయి వ్యూహకర్తగా నిలబెట్టేలా చేసిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అప్పటి వరకు బీజేపీ వర్సెస్ ఎల్డీఎఫ్ కూటమి మధ్య సాగుతున్న ప్రచార పర్వాన్ని ఎవరూ ఊహించని రీతిలో పినరయి విజయన్ పై మాటల యుద్ధానికి తెర లేపి గేమ్ ను పూర్తిగా ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ గా మార్చివేశారు. ఏదైనా రాష్ట్రంలో మేనిఫెస్టో ప్రకటించాలంటే అది అధిష్ఠానం పెద్దల సమక్షంలో జరుగుతుంది. కానీ ఏఐసీసీ కేరళలో మాత్రం ఆ అవకాశం రేవంత్ రెడ్డికి అప్పగించింది. అంటే రేవంత్ రెడ్డిని పార్టీ పెద్దలు మరింత విశ్వసిస్తున్నారని ఆ విశ్వాసం నిలబెట్టుకునేలా రేవంత్ రెడ్డి వ్యూహరచన చేసి కేరళలో కాంగ్రెస్ కూటమిని అధికారం దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషించారనే చర్చ జరుగుతోంది. తనకున్న దూకుడు తత్వం రేవంత్ రెడ్డి ప్రచార శైలి, ప్రత్యర్థులపై ఆయన చేసే విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. పినరయి విజయన్ వంటి సీనియర్ నాయకులను సైతం ధీటుగా ఎదుర్కోవడం వల్ల ఆయన కేరళలో కీ రోల్ గా మారడంతో కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి గ్రాఫ్ మరింత పెరిగిందని ఆయన ఆలోచనలకు మరింత మద్దతు అధిష్ఠానం పెద్దల వద్ద దక్కే అవకాశం ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

# త్వరలో మంత్రివర్గ విస్తరణ?


మొదటి తరువాయి

వీరి స్థానంలో ఎవరికి ఛాన్స్ ఉంటుందనేది త్వరలో తెలుస్తుంది. కానీ ఖాళీగా ఉన్న రెండింటికీ మాత్రం ఒక బీసీ, ఒక ఎస్టీ (లంబాడా)కి ఇవ్వాలని దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. జిల్లాల సమీకరణాన్ని పరిగణనలోకి తీసుకుని ఆశావాహుల్లో ఎవరికి ఇవ్వాలన్నది ఫైనల్ కానుంది. ఎలాగూ సెకండ్ వీక్ తర్వాతనే మంత్రివర్గంలో మార్పులు ఉంటాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ లోపే ఒకసారి సీఎం, పీసీసీ చీఫ్ ఢిల్లీ పర్యటన ఉండే అవకాశముంది. ఖాళీగా ఉన్న రెండు బెర్తుల్లో ఒకదాన్ని తప్పకుండా లంబాడా కమ్యూనిటీకి ఇవ్వాలనే సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని పార్టీ వర్గాల సమాచారం. బాలు నాయక్, రామచంద్రునాయక్ లలో ఒకరికి అవకాశం దక్కనుంది. రామచంద్రు నాయక్ పేరును డిప్యూటీ స్పీకర్‌గా ఇప్పటికే సీఎం ప్రకటించారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుని బాలు నాయక్‌ను డిప్యూటీ స్పీకర్ చేయడంపైనా పార్టీలో చర్చ జరుగుతున్నది. కానీ రామచంద్రు నాయక్ పేరును ప్రకటించిన తర్వాత ఆ బాధ్యతలు చేపట్టడానికి బాలు నాయక్ సుముఖంగా లేరనే వార్తలు పార్టీ వర్గాల నుంచే వినిపించాయి. మంత్రి పదవిని ఆశించాలని, అది దక్కకపోతే సైలెంట్‌గా ఉండటానికి కూడా సిద్ధపడ్డారని, కానీ ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ పోస్టుకు పేరును ప్రకటించిన తర్వాత ఆ స్థానంలోకి వెళ్ళడానికి మాత్రం ఆసక్తిగా లేరని తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం నలుగురు రెడ్డి, నలుగురు ఎస్సీ, ముగ్గురు బీసీ, ముగ్గురు అగ్రవర్ణాలు, ఒక మైనార్టీ ఒక ఎస్టీకి చెందినవారు ఉన్నారు. దీంతో ఒక బీసీ, ఒక లంబాడా ఇస్తే సోషల్ జస్టిస్ ఈక్వేషన్ సెట్ అవుతుందన్నది ఏఐసీసీ భావన. రాష్ట్రంలో బీసీ జనాభా 56% ఉన్నందున ఆ కమ్యూనిటీకే ఇవ్వడమే సహేతుకం అనేది పార్టీ ఆలోచన. బీసీల్లో ముదిరాజ్, గౌడ్, పద్మశాలికి అవకాశం దక్కినందున మరో బీసీ మంత్రిని ఏ సామాజికవర్గం నుంచి ఎంపిక చేయాలన్నది కీలకం. మున్నూరు కాపు సామాజికవర్గానికి ఇటీవలే మంత్రి హోదాతో కూడిన సలహాదారు పోస్టు ఇవ్వడంతో మంత్రి పదవికి కూడా అదే సామాజికవర్గానికి అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ టూర్ తర్వాత దీనిపై కొంత క్లారిటీ రానున్నది.

## అసాధ్యమైన యుద్ధమా?

# ఒప్పందమా?

మొదటి తరువాయి



దీన్ని అర్థం చేసుకోవడానికి ఒకే ఒక మార్గం ఉంది: ట్రంప్ ఒక అసాధ్యమైన సైనిక చర్య లేదా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందం మధ్య ఎంచుకోవాలి. అమెరికాకు నిర్ణయం తీసుకునే అవకాశాలు తగ్గిపోయాయి అని పేర్కొన్నది. అంతేగాక, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధాన్ని ముగించడానికి ఇరాన్ ఒక గడువు విధించిందని తెలిపింది. అయితే అందుకు కచ్చితమైన కాలపరిమితిని ఐఆర్‌జీసీ పేర్కొనలేదు. అమెరికా పట్ల చైనా, రష్యా, యూరప్ వైఖరిలో మార్పు వస్తున్నదని, ఇది పెరుగుతున్న అంతర్జాతీయ ఒత్తిడిని సూచిస్తున్నదని కూడా ఐఆర్‌జీసీ తెలిపింది.

దిగ్బంధాన్ని ఎత్తేయాలి..

యుద్ధాన్ని ముగించేందుకు 14 పాయింట్లతో ఇరాన్ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. పాకిస్థాన్ ద్వారా దీన్ని అమెరికాకు అందజేసింది. లెబనాన్‌సహా అన్ని విధాలుగా యుద్ధాన్ని ముగించాలని కోరింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ పొడిగింపును తిరస్కరించింది. 30 రోజుల్లోగా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేలా పరిష్కారాన్ని కోరింది. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, తమపై మళ్లీ దాడి చేయకుండా భద్రతా హామీలు ఇవ్వాలని, హొర్ముజ్ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ ప్రతిపాదనల్లో కోరింది.

## రాష్ట్రంలో క్షీణించిన

# శాంతిభద్రతలు

మొదటి తరువాయి

మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ”ప్రభుత్వం, పోలీసులు ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం, సోషల్ మీడియా పోస్టులకు వేధించడంపై చూపే శ్రద్ధ.. ప్రజల భద్రతపై చూపడం లేదు. కరీంనగర్‌లో పట్టపగలు తుపాకులతో వచ్చి దోపిడీ చేయడం అత్యంత దుర్మార్గం. ఘటన జరిగి 32 గంటలైనా నిందితులను పట్టుకోకపోవడం పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం’ అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కరీంనగర్‌ను సేఫ్ సిటీగా మార్చేందుకు 769 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించామని, గంగుల కమలాకర్ చొరవతో వేల సంఖ్యలో కెమెరాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నేడు నేరగాళ్లకు పోలీసులంటే భయం లేకుండా పోయిందని, దుండగులు పారిపోయింది పోలీసుల భయంతో కాదనీ.. షాపు సిబ్బంది చనిపోయారని భావించి మాత్రమే’ అని అన్నారు.

బండి సంజయ్ వైఖరిపై ప్రశ్నలు

‘నగల దుకాణంలో నలుగురు సిబ్బందికి తుపాకీ గాయాలైతే, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల్లో ఒక్కరికైనా బాధితులను చూసే సమయం లేదా? కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి శవాల మీద రాజకీయాలు తప్ప ఏమీ తెలియదు. రాష్ట్రంలో దోపిడీ జరిగితే హోంశాఖను, రేవంత్‌రెడ్డిని నిలదీయాల్సింది పోయి బీఆర్ఎస్‌పై పడతారేంటి? రేవంత్‌రెడ్డిపై సంజయ్‌కి అంత ప్రేమ ఎందుకు?’ అని కేటీఆర్ ప్రశ్నించారు. పోలీసులు 20 ఏండ్ల నాటి కేసులను తవ్వి తీసి బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అధికారం శాశ్వతం కాదని, అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై తాము అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు కాపాడలేని పోలీస్ వ్యవస్థ ఎందుకు? అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చోవడం కాదని, శాంతి భద్రతలను కమాండ్ చేయడం నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, దోపిడీ దొంగలను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

**- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణలో కూడా బీజేపీ పాగా వేయడం ఖాయమని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని, అభివృద్ధిని అడ్డుకునే పార్టీలకు ప్రజల మద్దతు ఉండదని ఆయన అన్నారు. కరీంనగర్ నగరంలోని తెలంగాణ చౌక్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు టపాసులు



కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును, డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించిన పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సునీల్ రావు పేర్కొన్నారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సందర్భంగా కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కార్యాలయం ముందు కూడా పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఈ విజయంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపబడిందని, బండి సంజయ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

## జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం



**కరీంనగర్/పాలకుర్తి, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ 6వ డివిజన్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ శాలువ కప్పి సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సత్కరించారు. బీజేపీ నేత నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని నేతలు సూచించారు. గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు కూడా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి సన్మానించడం పాఠశాల వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చింది.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు



**కరీంనగర్/గన్నేరువరం, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ రామడుగు మండలంలోని వెదిర రైతు వేదిక కార్యాలయంలో నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. గన్నేరువరం మండలంలోని నాలుగు రైతు వేదికల్లో కూడా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఓ కిరణ్మయి రసాయనిక ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ఈ వారోత్సవాలు నిర్వహించబడ్డాయి.

## అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలు



**హుస్నాబాద్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతున్న వృద్ధుడిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. మీర్జాపూర్ గ్రామానికి చెందిన పోగుల చంద్రయ్య (62)ను హనుమకొండ నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, చెవుల నుండి రక్తస్రావం జరగడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కారు ఢీకొట్టి పరారైన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఆకాశవాణి కేంద్రం ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని వినతి



**కరీంనగర్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ ఆకాశవాణి కేంద్రాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని స్థానిక కళాకారులు, రచయితలు, సాహితీ సంఘాల ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శరత్ సాహితీ కళా స్రవంతి అధ్యక్ష కార్యదర్శులు సబ్బని లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్ర శర్మ, శ్రీ అరబిందో సొసైటీ అధ్యక్షుడు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, వెల్మల జైపాల్ రెడ్డి తదితరులు కరీంనగర్ ఎంపీ మరియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం కేంద్రంలో ప్రోగ్రామ్ రూపకల్పన, రికార్డింగ్‌కు తగిన సదుపాయాలు లేకపోవడం వల్ల స్థానిక ప్రతిభకు అవకాశాలు తగ్గుతున్నాయని వారు తెలిపారు. రైతులకు రేడియో కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం కేంద్రాల సరసన కరీంనగర్ కేంద్రాన్ని కూడా హై పవర్ ట్రాన్స్‌మిషన్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయమై బండి సంజయ్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవడానికి తోడ్పడతానని హామీ ఇచ్చారు. ప్రాంతీయ సంస్కృతిని ప్రోత్సహించి ప్రజా ప్రసార సేవలను బలోపేతం చేయడమే లక్ష్యమని వినతిదారులు పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి, అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బండారిగుంట గ్రామానికి చెందిన రైతులు తమ భూమిపై అక్రమ పట్టాలు రద్దు చేయాలని కోరగా, సుల్తానాబాద్ మండలానికి చెందిన వృద్ధుడు తన కుమారులు, కోడలిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. జీవనోపాధి కోసం ఉపాధి కల్పించాలని కోరిన మరో దరఖాస్తును వారధి సొసైటీకి రాసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి శ్రీకారం -వీవో భవనాలకు భూమిపూజలు



**శంకరపట్నం, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శంకరపట్నం మండలంలోని ముత్తారం, ధర్మారం, ఆముదాలపల్లి గ్రామాల్లో నిర్మించనున్న వీవో భవనాలకు భూమిపూజ చేశారు. మహిళా సంఘాల సమావేశాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయని, ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆయన సూచించారు. అదే రోజు మొలంగూర్ గ్రామంలో మోరె గణేశ్ ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఎండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేయడం ముదావహమని పేర్కొంటూ స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా వీవో భవనాలు, అంబలి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## 40వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**కరీంనగర్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ 40వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నలువాల పుష్పలత రవీందర్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రాంతీయ ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

## నేడు లాలపల్లి లో బోనాల ఉత్సవాలు



**ఎలిగేడు, మే 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ, మహాలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాల పండుగ వైభవంగా జరగనుంది. గ్రామమంతా అన్ని కులాల ప్రజలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పణలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామ ప్రజలందరూ ఏకతాటిపై బోనాల ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి చెందాలి" అని ఆకాంక్షించారు.

## సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా జాబ్ మేళా




**సిద్దిపేట, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 8న సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి జాబ్ మేళా నిర్వహించబడనుంది. జిల్లా కలెక్టర్ హైమావతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టర్లను విడుదల చేస్తూ నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేళాలో 250కు పైగా ప్రైవేట్ కంపెనీలు పాల్గొని పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా లక్ష్యమని అధికారులు తెలిపారు.

## సర్పంచ్ రాములుకు పరామర్శ



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ మండ్లి రాములు తండ్రి అంజయ్య దశదినకర్మ ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండాలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సర్పంచ్ రాములు కు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట సర్పంచ్ రమేష్ నాయక్, మున్సిపల్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, నాయకులు రాజా, జైపాల్, జంగయ్య, జగ్గురాం, చంద్రు తదితరులు ఉన్నారు.

## పి.ఎం.జే జ్యువెలరీ ఘటన బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



**కరీంనగర్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలోని పి.ఎం.జే జ్యువెలరీ షాపులో జరిగిన దోపిడీ ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు పోలీసుల చర్యలను ప్రశంసించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ తదితరులు ఘటన స్థలాన్ని సందర్శించి సిబ్బందిని ధైర్యం చెప్పారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. నేతలు మాట్లాడుతూ దొంగలను పట్టుకునేందుకు పోలీసులు వేగంగా చర్యలు చేపట్టారని, సీసీ ఫుటేజ్ ఆధారంగా బృందాలను నలుదిక్కుల పంపారని తెలిపారు.ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నేతలు ఘటనను రాజకీయ కోణంలో చూస్తూ వ్యాఖ్యలు చేయడం బాధాకరమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. గతంలో బి.ఆర్.ఎస్ పాలనలో అనేక దారుణ సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు.ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, త్వరలోనే దొంగలను పట్టుకొని నగలను రికవరీ చేస్తారని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

## రాజరాజేశ్వర రెడ్డి భవన్ నూతన కమిటీ నియామకం




**వేములవాడ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేములవాడ రాజరాజేశ్వర రెడ్డి భవన్‌లో నూతన సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా కొమిరెడ్డి నర్సింహారెడ్డి, కన్వీనర్‌గా ఉమ్మారెడ్డి వెంకట్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా ఉట్కూరు రాధాక్రిష్ణ రెడ్డి, మద్దూరి రాంరెడ్డి, బద్దం మోహన్ రెడ్డి, ధోనురి శ్రీనివాస్ రెడ్డి, ఆల నర్సింహారెడ్డి, ఏ. రఘునందన్ రెడ్డి, భవాని అంజి రెడ్డి, దుగ్గు విజయ్ భాస్కర్ రెడ్డి, సన్నవేల్లి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, రెడ్డి భవన్‌ను మరింత సదుపాయాలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.సంఘం అభివృద్ధి, సామాజిక సేవల విస్తరణ లక్ష్యంగా నూతన కమిటీ కృషి చేయనుంది.

## పి.ఎం.జే ఘటన బాధితులను పరామర్శించిన కేటీఆర్



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిన్న పి.ఎం.జే నగల దుకాణంపై దొంగల దాడిలో గాయపడిన బాధితులను ఆసుపత్రిలో పరామర్శించిన బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఆయనతో పాటు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా ఉన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి అవసరమైన వైద్య సహాయం అందించాలని వైద్యులను కోరారు. బాధితులకు అండగా నిలిచి ధైర్యం చెప్పిన కేటీఆర్, కమలాకర్ పరామర్శతో కుటుంబ సభ్యులు కొంత ఊరట పొందారు.

## యువత భారతీయ సంస్కృతి సంప్రదాయాన్ని పాటించాలి

- దింటకుర్తి నారాయణ స్వామీజీ



**నల్లగొండ, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
"భారతదేశ సంస్కృతి అన్ని దేశాలకు ఆదర్శం" అని పూజ శ్రీ దింటకుర్తి నారాయణ స్వామీజీ, జిల్లా ప్రచారక్ కొలను రుషివర్ధన్ పేర్కొన్నారు.నల్లగొండలోని గొల్లగూడలో సోమవారం జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ, యువత ప్రచాత్య దేశాల సంస్కృతి విడనాడి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని, లవ్ జిహాద్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా శ్రీ నటరాజ నాట్యాలయం నాట్యాచార్యులు కారింగ్ సుధాకర్ బృందం -- వర్ణిక విలాసిని, అద్విత, సుమాలిక, శ్రీవల్లి, రిత్విక -- చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో మహిళా వక్తలు డాక్టర్ ఇటికాల సింధూర, నన్నూరి లత తదితరులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

-- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**నల్లగొండ, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ అందిస్తున్న పాల ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం ప్రసాద్ రవీందర్ నగర్‌లో విజయ తెలంగాణ డెయిరీ మిల్క్ పార్లర్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, "కల్తీ లేని, నాణ్యమైన పాల ఉత్పత్తులను విజయ డెయిరీ తక్కువ ధరల్లో ప్రజలకు అందిస్తోంది. ఆరోగ్య రక్షణ కోసం పాలు, నెయ్యి, పెరుగు, బాదం మిల్క్, పన్నీర్, ఐస్‌క్రీమ్, కోవా, వాటర్ బాటిల్, కీర్ మిక్స్, మిల్క్ కేక్, బట్టర్ మిల్క్, ఫుల్ క్రీమ్ పాలు, టెట్రా మిల్క్ వంటి ఉత్పత్తులను ప్రజలు వినియోగించాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామగిరి అఖిల్ రావు, ఆల్లి సుభాష్ యాదవ్, ఆల్లి మల్లికార్జున్ యాదవ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్, విజయ డెయిరీ జిల్లా డిస్ట్రిబ్యూటర్ వి. రాజేంద్రప్రసాద్, నిర్వాహకులు పి. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీలం వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

- కొండపల్లి రామచంద్రరావు



**మహబూబాబాద్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కురవి మండలం సూదనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం అకాల వర్షం, పిడుగు కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు నీలం వెంకన్న మృతిచెందారు.సోమవారం ఉదయం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన సందర్భంగా టిడిపి పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచంద్రరావు, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకట నారాయణ ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, "వెంకన్న భార్య, ఇద్దరు ఆడపిల్లలు అనాధలయ్యారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి" అని కోరారు.అదేవిధంగా, "కళ్లాలో పేరుకు పోయిన ధాన్యం కాంటాలు జరగకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. కాంటాలు వేగవంతం చేయాలి" అని డిమాండ్ చేశారు. అనంతరం పిడుగు పడిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.ఈ కార్యక్రమంలో కోమ్మురాజుల వెంకన్న, లింగయ్య, ఉపేందర్, దుస్స శ్రీను, షరీఫ్, నీలం కన్నయ్య, వెంకన్నలు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ' కొత్త తరం కోసం

- కొత్త స్వరం' నినాదంతో ప్రజా క్షేత్రంలోకి



**మహేశ్వరం, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి హైదరాబాద్‌లో పార్టీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవితను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చ జరిగింది. గ్రామ స్థాయి నుండి పార్టీని పటిష్ఠం చేయడానికి తీసుకుంటున్న చర్యలను పాండురంగారెడ్డి వివరించారు. "కొత్త తరం కోసం -- కొత్త స్వరం" అనే నినాదంతో యువతను, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పార్టీ ఆశయాలను ఇంటింటికీ తీసుకెళ్తామని ఆయన పునరుద్ఘాటించారు.రంగారెడ్డి--పాలమూరు ఎత్తిపోతల పథకం విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 8న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అధినేత్రి కవిత దిశానిర్దేశం చేసినట్లు పాండురంగారెడ్డి తెలిపారు. "జిల్లా ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తి లేదు. రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆందోళన విజయవంతం చేయాలి. ప్రజా పక్షపాతిగా తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ పోరాడుతుంది. భవిష్యత్తులో జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతోంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



**షాద్‌నగర్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విట్యాల్ గ్రామం మొండోని రాయ్ తండాలో నిర్మాణంలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయానికి ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల పాండురంగం 51,000 విరాళం అందజేశారు.గ్రామస్తులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకున్న ఆయన, సర్పంచ్ శంకర్, మాజీ ఎంపీపీ బాబు సమక్షంలో చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా పాండురంగం మాట్లాడుతూ, "దేవాలయ నిర్మాణంలో భాగస్వామి కావడం, భగవంతుడి సేవ చేసుకునే భాగ్యం కలగడం పట్ల సంతోషంగా ఉంది. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలి" అని ఆకాంక్షించారు.

## సరంపేట తండాలో రహదారి పనులు ప్రారంభం



**మర్రిగూడ, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్నో ఏళ్లుగా రహదారి సమస్యలతో ఇబ్బంది పడుతున్న సరంపేట తండా ప్రజలకు విముక్తి లభించింది. గ్రామ సర్పంచ్ నక్క రాములమ్మ రవి ఆదివారం రహదారి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రహదారి పనులను ప్రారంభించాం. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పిస్తాం" అని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రవణ్, వార్డు సభ్యులు నక్క యాదయ్య, రావుల రాజు, పసుపుల కవిత, నక్క వెంకటేష్, కత్తుల శివరాణి ప్రసాద్, పోకల అరుణమ్మతో పాటు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు పొందాలని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ముదిరాజ్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పరిశీలించి మాట్లాడారు.. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కు రూ.2,389 ఉందని, సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు.

## విద్యార్థులను సన్మానించి అభినందించిన సర్పంచ్

**ఇల్లంతకుంట**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘనంగా శాలువ తో సత్కరించిన సర్పంచ్ వసంత నర్సయ్య. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ఏకాగ్రతతో భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గ్రామానికి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని. పట్టుదలతో చేస్తే ఏదైనా




సాధ్యమే అవుతుందని చెడు అలవాట్లకు పోకుండా ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా విని విధిగా పాటించి భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి ఉపాధ్యాయులు రమేష్ ,పద్మలత గ్రామపంచాయతీ వాటి సభ్యులు రాణి , అనిల్ కుమార్ ప్రజలు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూధాన్ అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు



**వెల్దండ, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : వెల్దండ మండలంలోని కొట్ర గ్రామం సర్వే నెంబర్ 22లో జరిగిన అక్రమ భూధాన్ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని బీఎస్పీ పార్టీ నాయకుడు నీరటి రమేష్ మండల కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో భూధాన్ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, కేవలం నిషేధిత జాబితాలో చేర్చడమే తప్ప, ఇప్పటికే జరిగిన రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "రెవెన్యూ అధికారులు రికార్డులు తనిఖీ చేయకుండా భూధాన్ భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు? ఇప్పటికే జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి" అని రమేష్ డిమాండ్ చేశారు. మండల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు అయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ తరపున ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**వెల్దండ, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి నియోజకవర్గంలోని చారకొండ మండల జూపల్లి గ్రామం రైతు వేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో కూడా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా వెల్దండలో వే బ్రిడ్జ్ మిషన్ను ప్రారంభించి, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాపాలన--ప్రగతి నివేదికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో జరుగుతున్న రైతు వారోత్సవాల సందర్భంగా సాయిల్ సంరక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, "భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించాలి" అనే లక్ష్యంతో రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చారకొండ, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి, ఉపసర్పంచ్ శీను, వివిధ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి..





**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి వల్ల భూమిలోని లోపాలను తెలుసు కోవచ్చని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం ఆమనగల్లుతో పాటు మండల పరిధిలోని రాంనుంతల, పోలేపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల్లోని రైతు వేదికలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ వారు మాట్లాడుతూ.. విచక్షణ రహితంగా పంటలపై ఎరువులు వాడడం ద్వారా పంట పెట్టుబడి పెరగడంతో పాటు భూసారం దెబ్బ తింటుందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను వాడడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటుగా సూక్ష్మ పోషక లోపాలను అధిగమించవచ్చునని రైతులకు సూచించారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శ్రీను, వెంకటయ్య, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, రైతులు ధనుంజయ, జైపాల్, కృష్ణ, శేఖర్ గౌడ్, రవి మరియు పంచాయతీ సెక్రటరీలు వినోద్, మల్లేష్, ఏఈఓ లు భూదేవి, మీనాక్షి, బాలకృష్ణ, ప్రభావతి మరియు రైతులు తదితరులు ఉన్నారు.

## ఎలిగేడు లో బీజేపీ విజయోత్సవాలు



ఎలిగేడు, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించిన సందర్భంగా జిల్లా బీజేపీ పిలుపు మేరకు ఎలిగేడు మండలంలో సంబరాలు జరిగాయి. మండల అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గర్రెపల్లి నారాయణ స్వామి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మల్లారపు అంజయ్య, అడ్డగుంట తిరుపతి, కోడూరి శ్రీనివాస్, బోగే కిరణ్, అసంపల్లి రవీందర్, అమరగొండ గంగయ్య, గడ్డం సతీష్ రెడ్డి, ఎడ్ల సతీష్ రెడ్డి, మ్యాదరవేణి రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో ఫైనాన్స్ బాధితులకు అండగా ఆర్ టిఐఎస్ ఎస్

**-డిజిపి తో కె. బాబురామ్ నాయక్ భేటీ.**
**-1,000 కోట్ల కుంభకోణంపై సమగ్ర విచారణకు వినతి.**
**- సానుకూలంగా స్పందించిన డిజిపి.**



**హైదరాబాద్ మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ రాష్ట్రంలో వెలుగుచూసిన భారీ మైక్రో ఫైనాన్స్ కుంభకోణం (మల్టీపర్పస్ నెట్‌వర్క్ మార్కెటింగ్ చైన్ సిస్టమ్) బాధితులకు న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కె. బాబురామ్ నాయక్ సోమవారం రాష్ట్ర డిజిపి ని కలిసి వినతిపత్రం సమర్పించారు.
ఈ భారీ స్కామ్ వల్ల సుమారు ?1,000 కోట్ల మేర నిధుల గోల్‌మాల్ జరిగిందని, దీనివల్ల ముఖ్యంగా నిరుపేద గిరిజన, దళిత మరియు వెనుకబడిన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని కె. బాబురామ్ నాయక్ డిజిపి దృష్టికి తీసుకువెళ్లారు.
**సమగ్ర విచారణకు విజ్ఞప్తి:** ఈ కేసులో లోతైన దర్యాప్తు జరిపి, బాధ్యులైన నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కె. బాబురామ్ నాయక్ కోరారు.
**ఆస్తుల జప్తు:** నిందితుల ఆస్తులను వెంటనే అటాచ్ చేసి, ఆ సొమ్మును బాధితులకు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు భరోసా: ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన బాధితుడు మరియు కీలక సాక్షి రామవత్ రమేష్‌తో పాటు ఇతర సాక్షులకు పోలీస్ శాఖ రక్షణ కల్పించవలసిందిగా కోరారు.
**డిజిపి స్పందన:**
ఆర్ టి ఐ ఎస్ ఎస్ బృందం అందించిన వివరాలపై డిజిపి సానుకూలంగా స్పందించారు. ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు చేయిస్తామని, బాధితులకు కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. సాక్షులకు రక్షణ కల్పించే విషయంలో పోలీస్ శాఖ సానుకూలంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో కె. బాబురామ్ నాయక్ తో పాటు ఈ బృందంలో రామవత్ రమేష్ (కీలక సాక్షి), రమేష్ ( స్టేట్ లీగల్ సెల్ ప్రతినిధి), ఎం. రామకోటి మరియు ఆర్. హనుమా (బాధిత ప్రతినిధులు) పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలి.

-లారీలు,గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా చూడాలి.
-తూకంలో మిల్లర్ల మోసాన్ని అరికట్టాలి.
-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ.



**నిడమనూర్ మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఇటీవల కురిసిన అకాల వర్షం వలన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి, లారీలు గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా చూడాలని, తూకంలో మిల్లర్ల మోసాన్ని అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నిడమనూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో వేంపాడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం ,రైతు సంఘాల ప్రతినిధి బృందం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు కొనుగోలు కేంద్రాలలో కూడా అన్యాయాన్నికి గురకావడం ఏంటని ప్రశ్నించారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని పంపడానికి లారీలు లేవనే సాకుతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్స్ దగ్గరికి చేరుకున్న ధాన్యాన్ని క్వింటా కు రెండు నుండి నాలుగు కేజీలు తరుగు తీస్తున్నారని మిల్లు యజమానులపై చర్య తీసుకోవాలని, సంబంధిత అధికారులు నీమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగేటట్లు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రశ్నిస్తే తాలుందని నూకలు అవుతున్నాయని రకరకాల కారణాలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.
-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను మాట్లాడుతూ వ్యాపారులు గ్రామాల్లో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్లో రైతుల పేరుతో అమ్ముతున్నారని వీరికి మాత్రం లారీలు గన్ని బ్యాగ్స్, పుష్కలంగా అందుతున్నాయని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస వసతులు కూడా లేవని, సొసైటీ అధికారులు రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రైతన్నలను ఆదుకోవడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన పంట కొనక పోవడంతో ఈదురు గాలులు వర్షాలు వచ్చి రైతులు భారీ స్థాయిలో నష్టపోయే పరిస్థితి దాతరించిందని పెట్టిన పెట్టుబడులు వెళ్లక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆయన అన్నారు, ధాన్యం కొనుగోలు కోసం కూడా రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మాది రైతు ప్రభుత్వం ప్రతి గింజ కొంటాం అని గొప్పలు పలికే సర్కారుకు రైతుల సమస్యలు అర్థం కావడం లేదా అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు లో జరుగుతున్న జాప్యం, రైతులను మోసం చేస్తున్న విధానానికి వ్యతిరేకంగా ఈనెల 11న జరిగే కలెక్టరేట్ ధర్నాకు రైతాంగం పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల సిపిఎం మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, రైతు సంఘం జిల్లా నాయకులు నల్లబోతు సోమయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆకారపు నరేష్, మల్లికంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, వింజమూరి పుల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్ష భక్తులకు అన్నదానం


కోదండ రామాలయంలో శ్రీ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు


హనుమాన్ స్వాములకు బిక్ష వడ్డిస్తు

**- పాల్గొన్న ఎమ్మెల్యే విజయ రమణారావు**


బిక్షలో పాల్గొన్న హనుమాన్ స్వాములు

**ఎలిగేడు, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కోదండరామాలయంలో సోమవారం హనుమాన్ దీక్ష పరులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం మాట్లాడుతూ, "హనుమాన్ దీక్షలతో పెద్దపల్లి ప్రాంతం భక్తి వాతావరణంతో మార్మోగుతోంది. ఎంతో నియమనిష్ఠలతో మాల ధరించిన స్వాములకు అన్నదానం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. స్వాముల సిద్ధి సంకల్పం సఫలమవ్వాలి" అని ఆకాంక్షించారు. తరువాత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే విజయ రమణారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గరిమెళ్ళ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామరాజ శేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

## వరుస ప్రమాదాలకు నిలయంగా
# మారిన జాతీయ రహదారి

- కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా
- అసంపూర్తి రోడ్డు పనులతో వాహనదారుల ఆందోళనలు





**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పరిధిలోని శ్రీశైలం -- హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్--765) ప్రమాదాలకు కేంద్రంగా మారిందని కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణ, బీటీ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో గుంతలు, అసమాన ఉపరితలం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆయన వాపోయారు. సోమవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. పట్టణంలోని శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు మరమ్మతు పనుల భాగంగా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రాత్రి వేళల్లో లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. ఇటీవలే అనేక ప్రమాదాలు చోటుచేసుకుని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల మౌనంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు పూర్తి చేసి భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్ నెరవేర్చాలని కోరారు. "అభివృద్ధి అంటే ప్రాణాల రక్షణ కావాలి" అని స్థానికులు కోరుతున్నారని బాబా తెలిపారు.

# కేరళలో విజయం..
# తెలంగాణ కాంగ్రెస్ కు మరింత బలం

-టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడం పట్ల టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, నాయకులు ప్రచారం నిర్వహించడం.. తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించిందన్నారు. కేరళలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని.. మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, మండల పార్టీ అధ్యక్షుడు బిచ్యా నాయక్, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నాయకులు యాదయ్య గౌడ్, జహంగీర్ బాబా, శంకర్, రవి, రాములు, రామకృష్ణ, పత్య నాయక్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ప్రవీణ్ గౌడ్, బోస్ మహేష్, గంజి చంద్రశేఖర్, శ్రీను, కుమార్, లక్ష్మణ్, నరేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో బీజేపీ శ్రేణుల విజయోత్సవం



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అస్సాం, పశ్చిమబెంగాల్, పాండిచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో సోమవారం పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరై టపాసులు కాల్చి, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పు కోరుకున్నారని, మమతా బెనర్జీ అరాచక పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీని గెలిపించారని అన్నారు. బెంగాల్ లో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఊహించిన దానికంటే భారీ సీట్లు కైవసం చేసుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని ఆచారి పేర్కొన్నారు. వేడుకల్లో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్ కెకె, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, కో ఆప్షన్ సభ్యుడు అల్లాజీ గౌడ్ నాయకులు గోరటి నర్సింహా, చెక్కల లక్ష్మణ్, శ్రీకాంత్ సింగ్ కృష్ణ యాదవ్, ప్రశాంత్, బైకని శ్రీశైలం యాదవ్, వరికుప్పల శ్రీనివాస్, యాదగిరి, శ్రీకాంత్ సింగ్, విష్ణు, పద్మ ప్రశాంత్, నందు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు



**మహబూబాబాద్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాల సందర్భంగా మంగళవారం మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సులు జరుగనున్నాయి.జిల్లా ఉద్యాన ఒ పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. ఆయిల్ పామ్, మల్బరీ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంపుదలపై చర్చించనున్నారు. మహబూబాబాద్‌లో గిరిజన భవన్, డోర్నకల్‌లో విజయ గార్డెన్స్లో సమావేశాలు జరుగుతాయి.రైతులు, సర్పంచులు, వాలంటీర్లు, ఎఫ్‌పి.ఓలు పాల్గొని పంట మార్పిడి ద్వారా అధిక ఆదాయం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



**మహబూబాబాద్, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025లో నమోదైన హత్య కేసులో నిందితుడు సంపత్ శ్రీనుకు ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.ఫిర్యాదుదారు వనగల్ల గుట్టయ్య ఇచ్చిన సాక్ష్యాలు, పోలీసుల సమగ్ర దర్యాప్తు, ప్రజా అభియోగాధికారి వాదనలు ఆధారంగా న్యాయమూర్తి ఎండీ అబ్దుల్ రఫీ నిందితుడిని దోషిగా నిర్ధారించారు.దర్యాప్తు అధికారులు సమర్పించిన ఆధారాల బలం వల్లే ఈ తీర్పు వెలువడిందని పోలీసులు తెలిపారు. ప్రజలు నేరాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో
# అభివృద్ధి చేయాలి..





**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తిగా ఆమనగల్లును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య నూతన కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి లను కోరారు. ఇటీవల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా నియామకమైన పట్ల సోమవారం ఆయా కార్యాలయల్లో అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలు యువతకు స్ఫూర్తి కావాలని సూచించారు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత రాజ్యాంగం చాలా తక్కువ సవరణలతోనే సమర్థవంతంగా కొనసాగుతుండటం అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. సమాజంలో మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తూ, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సమానంగా జీవించేలా కృషి చేయాలని, అంబేద్కర్ స్ఫూర్తిని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సన్మానించిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు వస్పుల సురేష్, సభ్యులు మీసాల రమేష్, పాత్లవత్ రవి, లండం యాదయ్య, ఎడవల్లి రమేష్, వస్పుల శేఖర్, ఎండి అఫ్సర్, వస్పుల శివ తదితరులు ఉన్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి
# సహకరించాలి

-న్యాయమూర్తి అరుణ్ కుమార్



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నారం అరుణ్ కుమార్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను సోమవారం ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి పులబోకే అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సర్దార్ నాయక్ సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, దుడ్డు ఆంజనేయులు, మల్లేష్ న్యాయవాదులు రామకృష్ణ, మల్లేష్, జగన్ గౌడ్, కొప్పు కృష్ణ, మల్లేష్, శేఖర్, ఆంజనేయులు, శిరీష్, ప్రభు నాయక్, శ్రీశైలం, రమేష్, శ్రీనివాస్, శిరీష, ప్రియాంక, సునీత, మమత మరియు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

## ఇంటి నిర్మాణాలకు
# ' ఉప్పల ట్రస్ట్ ' చేయూత



**ఆమనగల్లు, మే 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 2వ మూర్తుజపల్లికి చెందిన గండికోట వీరేష్, కోడిచెర్ల నర్సింహ, కాలే వీరయ్య యాదమ్మ, ఒగ్గు విజయ్ కుమార్ ఇండ్ల నిర్మాణాలకు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో చేయూతనందించారు. బాధిత ఇంటి నిర్మాణానికి సిమెంట్ బ్యాగులను సోమవారం కౌన్సిలర్ కాలే యశోదమ్మ వీరయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2వ వార్డు మూర్తుజపల్లిలో పేదలను ఆదుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలే విక్రమ్, వరికుప్పల బాబు, గండికోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి పరాభవం

**-ఈ కారణాలే కొంపముంచాయా..?**



**న్యూఢిల్లీ మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేకుండా 15 ఏళ్లపాటు సాగిన మమతా బెనర్జీ పాలనకు తెరపడింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం ఓటమి దిశగా సాగుతోంది. బీజేపీ అధికారం దక్కించుకునేందుకు సిద్ధంగా ఉంది. పూర్తి ఫలితాలు వెల్లడించడమే ఆలస్యం. అయితే, 15 ఏళ్లపాటు సాగిన మమతా బెనర్జీ పాలనను దెబ్బకొట్టి, పార్టీని ఓడించిన అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. విశ్లేషకుల అంచనా ప్రకారం టీఎంసీ ఓటమికి మొదటి కారణం ఆర్జీ కర్ హత్యాచార ఘటన. ఈ ఘటన విషయంలో మమతా బెనర్జీ, ఆమె పార్టీ వ్యవహరించిన తీరుపై చాలా మందికి వ్యతిరేకత ఉంది. ఘటనలో బాధితురాలి తప్పే ఉందన్నట్లు ఆమె వ్యవహరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో సరిగ్గా వ్యవహరించలేదు. దీంతో మహిళలు, యువత మమతపై ఆగ్రహంతో ఉన్నారు. ఇదే సమయంలో బాధితురాలి తల్లికి బీజేపీ అసెంబ్లీ సీటు ఇచ్చి మరీ పోటీ చేయించింది. ప్రస్తుతానికి ఆమె విజయం దిశగా సాగుతోంది. హత్యాచార ఘటనలో మృతురాలి తల్లి పోటీ చేయడంతో సానుభూతి వ్యక్తమై బీజేపీకి మద్దతు పెరిగింది. జన్ జీ, జన్ ఎక్స్ యువత ఎక్కువగా బీజేపీకి అండగా నిలిచారు. టీఎంసీ సాగించిన గూండాయిజం, కార్యకర్తల దాడులు వంటి వాటితో ప్రజలు విసిగిపోయారు. తెలంగాణ టూరిజం ప్యాకేజీలు మరోవైపు మమత సన్నిహితులపై జరిపిన దాడుల్లో భారీగా అక్రమ నగదు పట్టుబడింది. ఇది కూడా మమత ఇమేజ్ మసకబారడానికి కారణాలు. ఇక ఈ ఎన్నికల్లో టీఎంసీ అనుసరించిన వ్యూహం మరో తప్పిదంగా చెప్పుకోవచ్చు. బీజేపీని బయటి పార్టీగా టీఎంసీ చెప్పుకొచ్చింది. కానీ, బీజేపీ మాత్రం మమత ప్రభుత్వం అవినీతి, అక్రమాల గురించి ప్రస్తావించింది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో టీఎంసీ విఫలమైందని ఆరోపించింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారుల్ని అడ్డుకోవడంలోనూ టీఎంసీ విఫలమైందని బీజేపీ విమర్శించింది. ఇక, ఇటీవల కేంద్రం నిర్వహించిన సర్ అంశంలో ఓట్ల తొలగింపు కూడా ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు.

## బెంగాల్ ముఖ్యమంత్రి రేసులో సినీ నటి..

**-కుర్చీ కోసం పోటీపడుతున్న సీనియర్లు..!**



**న్యూఢిల్లీ మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి జయకేతనం ఎగురవేసిన భారతీయ జనతా పార్టీ సంబురాల్లో మునిగితేలుతోంది. కమ్యూనిస్టులు.. ఆపై తృణమూల్ కాంగ్రెస్ కు కంచుకోటలా మారిన బెంగాల్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో అధికారాన్ని ఏర్పాటు చేయబోతోంది. మమతా బెనర్జీ పార్టీని షాక్‌కు గురి చేస్తూ.. భారీ విజయంతో కాషాయ పాలనకు నాంది పడిన వేళ.. కాబోయే ముఖ్యమంత్రి ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఎందుకంటే.. పార్టీ సంచలన విజయానికి కృషి చేసిన నలుగురు నేతలు సీఎం రేసులో ఉన్నారు. బెంగాల్‌లో అధికారాన్ని ఛేజిక్కించుకోవడం ఏళ్లుగా నిరీక్షించిన బీజేపీ కల సాకారమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సమాయత్తమవుతోంది. అయితే.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. అందుకు కారణం.. ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ మాదిరిగా బీజేపీ సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు వెళ్లలేదు. ప్రధాని నరేంద్ర మోడీ అన్నీతానై వ్యవహరిస్తూ మమతా బెనర్జీ పాలనకు చరమగీతం పాడారు. దాంతో.. ముఖ్యమంత్రిగా సీనియర్లకు అవకాశమిస్తారా? లేదా బెంగాలీవాసికే పట్టం కడుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎం పదవికి పోటీదారులుగా మహాభారత్ సిరీస్‌లో ద్రౌపది పాత్రతో సుపరిచితమైన నటి రూపా గంగూలీ , మహిళా నాయకురాలు అగ్నిమిత్ర పౌల్, సీనియర్ నాయకుడు సువెందు అధికారి, రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య ఉన్నారు. వీరితో పాటు నిశిత్ ప్రమాణిక్, ప్రజాదారణ కలిగిన దిలీప్ ఘోష్ సీఎం కుర్చీని ఆశిస్తున్నారు. ఈ ఆరుగురిలో ఎవరిని బీజేపీ తమ తొలి ముఖ్యమంత్రిని చేస్తుంది? అనేది రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది.

**బెంగాలీకే అవకాశం..**
ఎన్నికల ప్రచారం వేళ హోంమంత్రి అమిత్ షా బీజేపీకి ఓటేస్తే.. బెంగాలీని సీఎం చేస్తాం అని హామీ ఇచ్చారు. దాంతో.. షా మాట ఇచ్చినట్టు బెంగాలీవాసికి పట్టాభిషేకం చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది. కేంద్రమంత్రి సుకంతా ముజుందార్ మాట్లాడుతూ.. మాంసాహారం తినే వ్యక్తి తదుపరి బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతారు అని బీజేపీ గెలిస్తే మాంసం, చేపలు తిననివ్వరు అని ఎన్నికల సందర్భంగా ప్రజలను భయపెట్టిన మమతకు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో సోనాపూర్ దక్షిణ నియోజక వర్గం నుంచి రూపా గంగూలీ, అసాన్‌సోల్ సీటు నుంచి అగ్నిమిత్ర, నందిగ్రామ్ నుంచి సువెందు, ఖరగ్‌పూర్ సదర్ నుంచి దిలీప్ ఘోష్ గెలుపొందారు. ఈ నలుగురూ బెంగాలీలే కావడంతో.. ఈ చతుష్టయంలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని విశ్లేషకులు అంటున్నారు.

# సిల్వర్ స్క్రీన్ టు సీఎం సీటు.. ఎంజీఆర్, ఎన్టీఆర్, విజయ్..

## పార్టీ పెట్టి చరిత్ర సృష్టించిన స్టార్స్ వీళ్లే



**న్యూఢిల్లీ మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు నాట, తమిళ నాట సినిమా స్టార్స్‌ను ప్రేక్షకులు అభిమానించి, ఆదరించే తీరు చాలా ప్రత్యేకం. స్టార్స్‌ను కొందరు తమ ఇంటి మనుషుల్లా చూస్తారు. మరికొందరు డెమీ గాడ్స్‌గా చూస్తారు. అందుకే స్టార్స్ రాజకీయ రంగంలోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. రాజకీయ పార్టీలు స్థాపించి, ఏకంగా రాష్ట్రాలకు సీఎంలు అవుతున్నారు. అది కూడా పార్టీ పెట్టిన తర్వాత తొలి ఎన్నికల్లోనే అఖండ విజయం సాధించి సీఎంలు అవుతున్నారు. తాజాగా టీవీకే పార్టీ అధినేత, సూపర్ స్టార్ విజయ్ కూడా తమిళనాడు సీఎం పదవి చేపట్టబోతున్నారు. విజయ్ కంటే ముందు ఇద్దరు స్టార్స్ మాత్రమే ఇలా పార్టీలు స్థాపించి, మొదటి ఎన్నికల్లోనే విజయం సాధించారు. వారు ఒకరు ఎంజీఆర్. రెండోది ఎన్టీఆర్. తమిళనాడులో పెద్ద హీరోగా ఉన్న ఎంజీఆర్ (ఎంజీ రామచంద్రన్) 1972లో ఏఐఏడీఎంకే స్థాపించారు. ఆయన డీఎంకే పార్టీ నుంచి బయటకు వచ్చి తన సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత మొదటిసారి 1977లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తమిళనాడు సీఎంగా పదవి చేపట్టారు. అంటే పార్టీ పెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఆయన ఘన విజయం సాధించారు. ఆయన తర్వాత తెలుగు వారికి సంబంధించి అప్పట్లో ఉమ్మడి ఏపీలో సీనియర్ స్టార్ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారు. 1982లో టీడీపీని స్థాపించి, 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని భారీ విజయం సాధించారు. తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే విజయం సాధించిన ఎన్టీఆర్ సీఎం పదవి చేపట్టారు. అప్పట్లో ఆయన 201 సీట్లు గెలిచారు. ఆ తర్వాత నటుడు విజయ్ ఇప్పుడు తమిళనాడులో టీవీకేను స్థాపించి, అధికారం చేపట్టబోతున్నారు. ఆయన 2024లో పార్టీని స్థాపించారు. ఆ తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలివి. ఈ ఎన్నికల్లోనే విజయం సాధించి సీఎం పదవి చేపట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమకు సంబంధించి ముగ్గురు నటులు ఇలా పార్టీలు స్థాపించి, ఆ వెంటనే సీఎం పదవి చేపట్టారు. ఈ ముగ్గురూ కాకుండా తమిళనాడులో విజయ్ కాంత్, కమల్ హాసన్, ఉమ్మడి ఏపీలో చిరంజీవి, ఏపీలో పవన్ కళ్యాణ్, కర్ణాటకలో నటుడు ఉపేంద్ర వంటి వారు పార్టీలు స్థాపించినప్పటికీ సీఎంలు కాలేకపోయారు. వీరిలో చిరంజీవి కేంద్ర మంత్రికాగా, పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు.

## స్టాలిన్‌పై ప్రతీకారం తీర్చుకున్న డీఎంకే మాజీ నేత..

**-కంచుకోటలో గెలిచిన వీఎస్ బాబు**



**న్యూఢిల్లీ మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్‌పై ఆ పార్టీ మాజీ నేత ప్రతీకారం తీర్చుకున్నారు. కంచుకోట అయిన కొలత్తూరు స్థానంలో విజయ్‌కు చెందిన టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు గెలిచారు. స్టాలిన్ కంటే అధికంగా 9,192 ఓట్లు సాధించారు. 2011 ఎన్నికలకు ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా కొలత్తూరు స్థానం కొత్తగా ఏర్పడింది. ఆ సమయంలో డిప్యూటీ సీఎంగా ఉన్న స్టాలిన్ 2011 ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన కొలత్తూరు నుంచి తొలిసారి పోటీ చేశారు. ఏఐఏడీఎంకే అభ్యర్థి సైదై దురైసామిపై కేవలం 2,734 ఓట్ల స్వల్ప తేడాతో గెలుపొందారు. 2016 ఎన్నికల్లో ఏఐఏడీఎంకే అభ్యర్థి జేసీడీ ప్రభాకర్‌పై 37,730 మెజార్టీతో విజయం సాధించారు. అలాగే 2021 ఎన్నికలలో ఐఏడీఎంకే అభ్యర్థి ఆది రాజారామ్‌పై 70,384 ఓట్ల భారీ మెజారిటీతో స్టాలిన్ గెలిచారు. దీంతో మూడు వరుస విజయాలతో డీఎంకే కంచుకోటగా కొలత్తూరు స్థానం నిలిచింది. కాగా, గతంలో థౌజండ్ లైట్స్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు భారీ మెజారిటీతో గెలిచిన ఎంకే స్టాలిన్, 2011లో కొత్తగా ఏర్పడిన కొలత్తూరులో తొలిసారి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో 2011 వరకు ఉత్తర చెన్నై జిల్లా డీఎంకే ఇన్‌చార్జిగా ఉన్న వీఎస్ బాబుకు, స్టాలిన్ ప్రచారాన్ని పర్యవేక్షించే అదనపు బాధ్యతను అప్పగించారు. అయితే ఏఐఏడీఎంకే అభ్యర్థి సైదై దురైసామిపై కేవలం 2,734 ఓట్ల స్వల్ప తేడాతో అతికష్టంగా స్టాలిన్ గెలిచారు. ఇది వీఎస్ బాబుపై ప్రభావం చూపింది. దీంతో డీఎంకే ఆయనను పక్కనపెట్టింది. పార్టీ ఉత్తర చెన్నై జిల్లా అధ్యక్షుడిగా పీకే శేఖర్ బాబును ఆయన స్థానంలో నియమించింది. పార్టీ తీరుపై అసంతృప్తి చెందిన వీఎస్ బాబు 2016 జూన్‌లో డీఎంకేను వీడి ఏఐఏడీఎంకేలో చేరారు. మరోవైపు 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ ఏర్పాటు చేసిన టీవీకేలో వీఎస్ బాబు చేరారు. గతంలో డీఎంకేలో ఎదుర్కొన్న అవమానానికి ఆయన ప్రతీకారం తీర్చుకున్నారు. డీఎంకే కంచుకోట కొలత్తూరు స్థానంలో సీఎం స్టాలిన్‌పై పోటీ చేశారు. డీఎంకే చీఫ్ వరస విజయాలకు చెక్ పెట్టి ఆయనపై విజయం సాధించారు. టీవీకే చీఫ్ విజయ్ నమ్మకాన్ని వీఎస్ బాబు నిలబెట్టుకున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**-- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 99 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగా, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కూడా ప్రజావాణి కార్యక్రమాలు జరిగాయి. కరీంనగర్ రెవెన్యూ డివిజన్‌లో 75, హుజురాబాద్ డివిజన్‌లో 14 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. కలెక్టర్, రెవెన్యూ డివిజన్లలో కలిపి మొత్తం 188 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, ఏవో సుధాకర్ మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## బీజేపీ విజయాలపై హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ కూటమి అస్సాం, బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో సాధించిన విజయంపై కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి, జాతీయవాదానికి ప్రజలు ఓటు వేసి గెలిపించారని, ఇది బీజేపీ సైద్ధాంతిక విజయమని ఆయన పేర్కొన్నారు. మోదీ, అమిత్ షా, నితిన్ గడ్కరీ త్రిమూర్తుల నాయకత్వంలో పార్టీ విజయాలు సాధించిందని, ఇది కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అస్సాంలో ఆత్మగౌరవం గెలిచిందని, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని తెలిపారు. బెంగాల్‌లో బీజేపీ 200 సీట్లకు పైగా ఆధిక్యంలో ఉండటం గర్వకారణమని, టీఎంసీ చేసిన అరాచకాలను ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టబోతోందని పేర్కొన్నారు. తమిళనాడులో ప్రజలు విభజన రాజకీయాలను తిరస్కరించారని, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు కోల్పోయిందని విమర్శించారు. తెలంగాణలో కూడా కాషాయ గాలి వీచడం ఖాయమని, ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే మోదీ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే అభివృద్ధి సాధ్యమని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు



**ఎలిగేడు, మే 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేల ఆరోగ్యాన్ని కాపాడితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఏడీఏ కాంతారావు రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల సమతుల వినియోగం, సహ వ్యవసాయం, సేంద్రీయ కర్బనం, మట్టి నమూనా పరీక్ష ప్రాముఖ్యతపై వివరించారు. కూనారం ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర మాట్లాడుతూ, వచ్చే వానకాలంలో ప్రభుత్వం సూచించిన సన్న రకాలను వేసుకోవాలని, సేంద్రీయ వ్యవసాయం చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరి పొలాల్లో జింకు ప్రాముఖ్యతను వివరించి, రసాయన ఎరువులను తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ రాయ మల్లు, ఏవో ఉమాపతి, ఏఈఓ శరణ్య, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మహిళలకు గుడ్‌న్యూస్.. ఒక్క రోజే భారీగా దిగి వచ్చిన బంగారం ధర.. వెండి పరిస్థితి ఏంటి?



మవారం బంగారం ధరలు భారీగా పతనం అయ్యాయి. ఉదయం స్వల్పంగా తగ్గినా తర్వాత మాత్రం భారీ స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. పెళ్లిళ్ల సీజన్‌లో ధరలు తగ్గడంతో భారతీయ కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. సోమవారం ఉదయంతో పోలిస్తే మధ్యాహ్నం సమయానికి తులం బంగారంపై ఏకంగా రూ.1300లకుపైగా తగ్గింది. అదే గత గురువారంతో పోలిస్తే రూ.1900 వరకు దిగి వచ్చింది.గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం.. ధర తగ్గిన తర్వాత బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,620 వద్ద కొనసాగుతుండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,37,150 వద్ద ట్రేడవుతోంది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,12,220 వద్ద ట్రేడవుతోంది.

హైదరాబాద్, విజయవాడలో తులం బంగారం ధర రూ.1,49,620 వద్ద ఉండగా, అదే ఢిల్లీలో రూ.1,49,770 వద్ద కొనసాగుతోంది. ఇక్కడ కాస్త ఎక్కువగా ఉంది. అదే చెన్నైలో మాత్రం ఇంకా ఎక్కువగా ఉంది. ఇక్కడ తులం బంగారం ధర రూ.1,52,730 కొనసాగుతోంది. ఇంటే ఇతర ప్రాంతాలతో పోలిస్తే దాదాపు 2000 రూపాయలకుపైగానే ఉంది.

**ఇక వెండి పరిస్థితి ఏంటి?**

బంగారం ధరలు తగ్గుముఖం పడుతుండగా, వెండి పరిస్థితి మాత్రం పెద్దగా తేడా లేదు. సిల్వర్ ధర నిలకడగానే ఉంది. సాయంత్రం 4.30 గంటల సమయంలో కేజీ సిల్వర్ ధర రూ.2,65,000 ఉంది. అదే హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లో కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద కొనసాగుతోంది.

**బంగారం ధర ఎందుకు పడిపోతోంది**

బంగారం ధరలలో కొనసాగుతున్న తగ్గుదలకు ముడి చమురు, డాలర్ సూచీ కారణమవుతున్నాయి. ముడి చమురు ధరలలో నిరంతర పెరుగుదల ప్రపంచ ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచవచ్చు.

డాలర్ సూచీ కూడా నిరంతరం బలంగా కొనసాగుతోంది. దీనివల్ల పెట్టుబడిదారులు బంగారానికి బదులుగా డాలర్లలో పెట్టుబడి పెడుతున్నారు. ఇది కూడా బంగారం ధరలు పడిపోవడానికి కారణమవుతోంది. దీనికి తోడు, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడంతో పెట్టుబడిదారులు దూరంగా ఉంటున్నారు. బలహీనమైన సెంటిమెంట్ కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది.

## స్టాక్ మార్కెట్లకు ఎలక్షన్ రిజల్ట్స్ బూస్ట్..

### -లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాల్లో ముగిశాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, అసెంబ్లీ ఎన్నిక ఫలితాలు సూచీలపై ప్రభావం చూపాయి. పశ్చిమ బెంగాల్ లో భారతీయ జనతా పార్టీ విజయం దిశగా దూసుకెళ్తుండటం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. అయితే ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్.. ఆ తర్వాత మోస్తరు లాభాలకే పరిమితం అయ్యింది.బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 77,257.27 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,910.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 355.90 పాయింట్ల లాభంతో 77,269.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121.75 పాయింట్ల లాభంతో 24,119.30 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.08 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఎటర్నల్ స్టాక్స్ రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, ఐటీసీ, ఇన్ఫోసిస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి.అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4545 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో అన్నిచోట్ల స్పష్టమైన మెజారిటీలు రానుండటం మార్కెట్‌లకు జోష్ నిచ్చింది. స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పాటైతే మార్కెట్‌లు ఒడిదొడుకుల లోనయ్యే ప్రమాదం ఉండదు. ఏదో ఒక పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంటే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటవుతుంది. అప్పుడు ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపుతారు.

## బహుమతిగా మ్యూచువల్ ఫండ్స్..




**పిల్లలకు బదిలీ ముందు తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిందేంటి?**

మీ పిల్లలకు మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఈ కొత్త నిబంధనలను తెలుసుకోవాల్సిందే. నిజానికి పిల్లల దీర్ఘకాల సంపద నిర్మాణానికి మ్యూచువల్ ఫండ్స్ బహుమతి అనేది ఎప్పట్నుంచో ఉన్న చక్కని మార్గం. కానీ ఇటీవల వచ్చిన రూల్స్.. ఈ ప్రక్రియను చాలా సంక్లిష్టం చేశాయి. కాబట్టి డీమ్యాట్ అవసరాల నుంచి పన్ను సమస్యల వరకున్న నూతన విధివిధానాలను తల్లిదండ్రులు తప్పక తెలుసుకోవాలి. అప్పుడే పొరపాట్లను అధిగమించి అనుకున్నది సజావుగా సాగగలదు

నగదు, బంగారంలా కాకుండా.. మ్యూచువల్ ఫండ్ యూనిట్లను పన్ను చట్టం కింద మూలధన ఆస్తులుగా పరిగణిస్తారు. అందుకే బదిలీ, పన్నుల విషయంలో కొన్ని నిబంధనలు వర్తిస్తాయి.

మ్యూచువల్ ఫండ్ యూనిట్లను డీమ్యాట్ రూపంలోనే బహుమతిగా ఇవ్వవచ్చు. కనుక తల్లిదండ్రులు తమ హోల్డింగ్స్‌ను ముందే డీమ్యాట్‌లోకి మార్చాలి. గిఫ్ట్ డీడ్‌ను సృష్టించాలి.

డీమ్యాట్ రూపంలోకి మారిన తర్వాత మీ బహుమతిని ఆఫ్–మార్కెట్ మార్గదర్శకాల ఆధారంగా బదిలీ చేసుకోవచ్చు. ఇందుకు రూ.25 లేదా బదిలీ విలువలో 0.03 శాతాన్ని (ఏది ఎక్కువైతే అది) ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. దీనికి జీఎస్టీ, స్టాంప్ సుంకం అదనం.

పన్ను చట్టాల కింద బహుమతులకు మినహాయింపు ఉన్నందున మీ మ్యూచువల్ ఫండ్స్ బహుమతిపై మూలధన లాభాల పన్ను ఉండదు.

తల్లిదండ్రుల నుంచి మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా తీసుకొనే పిల్లలూ పన్నుల్ని చెల్లించనక్కర్లేదు. అయితే కొంత కాలం తర్వాత వాటిని అమ్ముకున్నప్పుడు మాత్రం మూలధన లాభాల పన్నును చెల్లించాల్సి ఉంటుంది.

పిల్లలు మైనర్లుగా ఉంటే.. బహుమతిగా ఇచ్చిన మీ మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చే ఆదాయం మీ (తల్లిదండ్రులు) ఆదాయం కిందకే వస్తాయి. అయినప్పటికీ ఏటా రూ.1,500 వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటుం ది. ఈ పరిమితి దాటితే మీ ఐటీ శ్లాబుల ప్రకారం పన్నులు తప్పవు. పిల్లల వయసు 18 ఏండ్లు నిండేదాకా ఇంతే.

# స్పోర్ట్స్

## లీగ్ దశ ముగుస్తున్నా ధోనీ జాడేది..

### చెన్నై ఎదురుచూపులు ఫలించేనా..!




ఐపీఎల్ ప్రతి సీజన్‌లో అభిమానులకు పిచ్చెక్కించే ఎంఎస్ ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఇంకా అడుగే పెట్టలేదు. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా తాలా ఆటను ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. ఆరంభ సీజన్ నుంచి వికెట్ల వెనకాల కుర్రాడిలా కదులుతూ.. ఫినిషర్‌గా సీఎస్కే విజయాల్లో కీలకమైన ధోనీ 19వ ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదుగో వస్తుండు.. అదుగో వస్తుండు అనే మాటలు వినిపిస్తున్నా.. ఈ మాజీ కెప్టెన్ ఎంట్రీపై సీఎస్కే యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు.చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఆడడంపై నెలకొన్ని అనిశ్చితికి తెరపడడం లేదు. మొన్నటికి మొన్న జట్టుతో పాటు హైదరాబాద్ వచ్చినా అతడు ఆడలేదు. రెండు రోజుల క్రితం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో రోహిత్ శర్మను కలిసిన ధోనీ.. తుది జట్టులో ఉంటాడని అందరూ అనుకున్నారు.కానీ, ఆశ్చర్యంగా.. ఎల్ క్లాసికో మ్యాచ్‌కు ధోనీ, హిట్‌మ్యాన్ వరసగా రెండోసారి దూరమయ్యారు. మే 5న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం జట్టంతా ఢిల్లీ వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి రాక మరింత ఆలస్యం కానుందనే వార్తలకు బలం చేకూర్చుతోంది.

**వయసూ కారణమే..!**

పంతొమ్మిదో సీజన్ ముందు గాయపడిన ధోనీ.. కాలి పిక్క గాయం నుంచి కోలుకుంటున్నాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతోనే ఐపీఎల్ ఆడడం లేదని సమాచారం. వయసు 44 ఏళ్లు కావడంతో ధోనీ ఫిట్‌గా మారేందుకు మరికొంత సమయం పట్టనుంది. దాంతో.. చెన్నైలోనే తాలా పునరావాస కేంద్రంలో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్నాడు.ఈ నేపథ్యంలో.. ధోనీ ఏదో ఒక దశలో అందుబాటులో ఉంటాడు అని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. పెద్దన్నలాంటి మహీ భాయ్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ ఆరంభంలో తడబడినా ఎట్టకేలకు ట్రాక్‌లో పడ్డాడు. ఓపెనర్ శాంసన్.. మిడిలార్డర్‌లో ఉర్విల్, కార్తిక్ శర్మ.. పేసర్ అన్షుల్ కంబోజ్‌లు రాణిస్తుండగా చెన్నై నాలుగో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

## బ్యాటింగ్ వైఫల్యంతో సన్ కు ఓటమి..



సొంతగడ్డపై డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించాలని ఉవ్విళ్లూరిన సన్ రైజర్స్ కు భంగపాటు ఎదురైంది. ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో – వికెట్లతో పరాజయం పాలైంది. అంతకుముందు టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ 19 ఓవర్లలోనే 165 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ సూపర్బ్ ఫిఫ్టీ (28 బంతుల్లో 61, 9 ఫోర్లు, 3 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. వరణ్ చక్రవర్తికి మూడు వికెట్లు దక్కాయి. అనంతరం కేకేఆర్ టార్గెట్ ను ఈజీగా ఛేజ్ చేసింది. కేవలం 18.2 ఓవర్లలో 3వికెట్లకు 169 పరుగులు చేసి గెలుపొందింది. వన్ డౌన్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ స్టన్నింగ్ ఫిఫ్టీ (47 బంతుల్లో 59, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. కమిన్స్, శివాంగ్, సాఖిబ్ హుస్సేన్ కు తలో వికెట్ దక్కింది. ఈ విజయంతో కోల్ కతా తన ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగానే ఉంచుకుంది. మరోవైపు ఈ మ్యాచ్ లో గెలిస్తే టేబుల్ టాపర్ అయ్యే సువర్ణావకాశాన్ని సన్ చేజార్చుకుంది. ఓ మాదిరి టార్గెట్ తో బరిలోకి దిగిన కేకేఆర్ కు ఓపెనర్లు ఫిన్ అలెన్ (13 బంతుల్లో 29, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ అజింక్య రహానే (36 బంతుల్లో 43, 4 ఫోర్లు, 1 సిక్సర్) అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా మళ్లీ జట్టులోకి వచ్చిన ఫిన్.. ఆరంభ ఓవర్ నుంచి సిక్సర్లతో రెచ్చిపోయాడు. తక్కువ సమయమే గడిపినా కానీ ఇంపాక్ట్ వేశాడు. ఎట్టకేలకు అతడిని కమిన్స్ పెవిలియన్ కు పంపాడు. ఆ తర్వాత రఘువంశీతో కలిసి ఇన్నింగ్స్ ను రహానే ముందుకు నడిపించాడు. వీరిద్దరూ సాధికారికంగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులెత్తింది. పవర్ ప్లేలో 71 పరుగులను పిండుకుంది. రఘువంశీ–రహానే ఇద్దరు కలిసి, ఆతిథ్య బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని, మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ స్కోరును నడిపించారు. ఈక్రమంలో అర్ధ సెంచరీకి చేరువైన రహానేను సాఖిబ్ హుస్సేన్ బోల్తా కొట్టించాడు. దీంతో 84 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత రింకూ సింగ్ (22 నాటౌట్) తో కలిసి ఇన్నింగ్స్ ను నడిపించే ప్రయత్నం చేశాడు రఘువంశీ. ఈక్రమంలో 39 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత రఘువంశీ ఔటైనా.. రింకూ, కామెరూన్ గ్రీన్ (3 నాటౌట్) తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

## మూడు ఫార్మాట్లు ఆడుతాను

### పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్



పాకిస్థాన్ తరఫున మూడు ఫార్మాట్లు ఆడుతానని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. ఈ విషయంలో సందేహం అక్కర్లేదన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌లో తాను సారథ్యం వహించిన పెషావర్ జల్మీ టీమ్‌ను బాబర్ ఆజామ్ విజేతగా నిలబెట్టాడు. ఈ టోర్నీలో బాబర్ ఆజామ్ 588 పరుగులతో సత్తా చాటాడు.గత కొద్ది రోజులుగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌తో టచ్‌లోకి వచ్చాడు. ఒకప్పుడు కోహ్లీతో పోటీపడిన బాబర్ ఆజామ్.. ఫామ్ కోల్పోయి పాకిస్థాన్ జట్టులో చోటు కూడా కోల్పోయాడు. అయినా పట్టువదలని బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌లో సత్తా చాటి పాకిస్థాన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.పీఎస్ఎల్ 2026 సీజన్ విజయానంతరం మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజామ్.. ఏ ఫార్మాట్‌లకు ప్రాధాన్యత ఇస్తారని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. 'టెన్షన్ వద్దు. మూడు ఫార్మాట్లు ఆడుతాను.'అని బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. క్రికెటర్లు ఫార్మాట్‌లను ఎంచుకోవద్దని అభిప్రాయపడ్డాడు. ప్రతీ ప్లేయర్ మూడు ఫార్మాట్లు ఆడాలని, అలా చేయడం వల్ల వారి సామర్థ్యాలు మెరుగుపడుతాయని తెలిపాడు. 'ఆటగాడు కేవలం ఆడటానికే. ప్రతి ఒక్కరూ అన్ని ఫార్మాట్‌లు ఆడాలి, టీ20లు, వైట్ బాల్‌కే పరిమితం కాకూడదు. రెడ్ బాల్ క్రికెట్ అపారమైన అనుభవాన్ని, ఇన్నింగ్స్ నిర్మాణం, సహనాన్ని అందిస్తుంది. దేశవాళీ నాలుగు రోజుల క్రికెట్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడే అనుభవం ఇస్తుంది. ఒక ఫార్మాట్ ఆడటం వల్ల మరొక ఫార్మాట్‌కు సహాయపడుతుంది .రెడ్ బాల్ గేమ్ టీ20లు, వన్డేల్లో మేలు చేస్తుంది. టెస్ట్ మ్యాచ్‌ల్లో పెంపొందించుకునే సహనం, మానసిక స్థితి వైట్–బాల్ క్రికెట్‌లో ఉపయోగపడుతుంది. గత కొద్ది రోజులుగా బ్యాటింగ్‌లోనాపై పెట్టుకున్న అంచనాలను అందుకోలేకపోయాను. ఇలా జరగడం మామూలే. కొన్నిసార్లు ప్రణాళికలు సరిగ్గా అమలు కావు. మీరు ఎంత ప్రయత్నించినా.. కొన్ని విషయాలు మీకు అనుకూలంగా ఉండవు.ఇలాంటి పరిస్థితుల్లో రెండు అడుగులు వెనక్కి వేసి, స్వీయ విశ్లేషణ చేసుకోవాలన్నాడు. తప్పులను విశ్లేషించి వాటిని సరిదిద్దుకోవాలి. నేను అదే చేశాను. నా సన్నిహితులు అపారమైన మద్దతు ఇచ్చారు. నా కుటుంబం, స్నేహితులు నన్ను ప్రోత్సహించారు. కోచ్‌లతో మాట్లాడి, నా ఆటను మెరుగుపర్చుకున్నాను. ప్రపంచకప్ నుంచి వచ్చాక సరిగ్గా రాణించలేకపోయాను. చాలా నిరుత్సాహానికి లోనయ్యాను. పీఎస్ఎల్‌కు పది రోజులు మాత్రమే సమయం ఉండగా.. నా తప్పులు, గేమ్ ప్లాన్ మార్పులను పరిశీలించుకున్నాను. నా టెక్నిక్, మానసిక స్థితిపై పనిచేశాను. నేను నా సహజమైన ఆటను ఆడుతాను. నా క్రికెటింగ్ షాట్స్‌కు కట్టుబడి ఉంటాను. పిచ్, మ్యాచ్ పరిస్థితి, జట్టు డిమాండ్ ఏదైతే.. దాన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నా'అని బాబర్ ఆజామ్ ముగించాడు.